
# పూరు మహారాజుతో భేటీ

చుట్టూ సైనిక శిబిరాలు. శిబిరాల లోపలబయటా సైనికుల హడావుడి. ఆయుధాల ఖంగుఖంగులు, సైనికాధికారుల ఆదేశాలు. సమీపంలో ఏనుగుల ఘీంకారాలు, గుర్రాల సకిలింతలు, రథాల ఘురఘురలు.



పులిగడ్డ విశ్వనాథరావు

దృశ్యం ఈ యుగానికి చెందినట్టు లేదు. సిన్మా షూటింగేమో అని చుట్టూ చూశా. ఎక్కడా షూటింగ్ పరికరాలు, లైట్ బాయ్స్ గట్రా కనబడలేదు.

నన్ను చూడగానే కొంతమంది సైనికులు చుట్టుముట్టారు. నా షర్టు , పాంటుని చూసి వాళ్ల " రెండు కాళ్లకి , చేతులకి గొట్టాల్లాంటి నూలు బట్టలూ వీడూనూ. వీడి వేషం , చూడండ్రా ! ' ' అని గేలి చేశారు.

"వీడి పాదరక్షలు బలేగా ఉన్నాయి చూడండ్రా! అయ్యో వీడి కంకణం ఎలా ఉందో ! " అంటూ నాస్పోర్ట్సు షూజ్ ని , వాచిని విడ్డూరంగా చూశారు. నా పెన్నుని ఆయుధం అనుకున్నారు కానీ నేను దాంతో రాసిచూపెట్టగా " ఐతే ఇది గంటం అన్నమాట! సిరా దీంట్లోనే ఉంది." అంటూ తిరిగి ఇచ్చేశారు.

వాళ్లలో ఒక సీనియర్ సైనికుడు నన్ను "నువ్వెవరవు?' ' అని అడిగాడు బిగ్గరగా.

"నేనండి...నేను భారతీయుడినే కానీ నాకు ఇదంతా అయోమయంగా ఉంది. ఇంతకీ ఇది ఎవరి సైనిక స్థావరం?"

"నీకు తెలియదా?ఇంక ఆ వేషాలు కట్టిపెట్టు . నువ్వు అలక్షేంద్రుడి తరఫున వచ్చిన చారుడివి అని మేం పసిగట్టలేదనుకున్నావా?" అని ఒక సైనికుడు అనగానే నాకు కథంతా తెలిసిపోయింది. దాంతో నేను సంతోషం పట్టలేకపోయా!

" ఇది క్రీస్తు పూర్వం 326సంవత్సరం అన్నమాట! నేను కోరుకున్నట్టుగానే పూరు మహారాజు అంటే పురుషోత్తమ మహారాజు సైనిక శిబిరాల ఆవరణలోకి ప్రవేశించాను. ఆయన అలక్షేంద్రుడు అంటే అలగ్జాండరుతో యుద్ధం చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నాడు."

సైనికులు నన్ను శత్రుపక్షం చారుడిగా భావించి వాళ్ల నాయకుడి వద్దకు తీసుకెళ్లారు. అతడు నన్ను పదాతిదళం అధిపతి వద్దకు తీసుకెళ్లమన్నాడు. పదాతి దళం అధిపతి నన్ను సేనాపతి ముందు హాజరుపరుచాడు.

సేనాపతి నన్ను " నువ్వెవరు?" అని గద్దించాడు.

" నేను భారతీయుడినే కానీ నేనుండే ఊరు ఈ యుగంలో లేదండి. నేను 23 శతాబ్దాల తరువాతి యుగానికి చెందిన వాడిని!" అన్నా.

" నీమాటలు నమ్మడానికి నాకు పిచ్చి పట్టిందనుకున్నావా? " అని ఉరిమాడు.

" లేదండీ! నేను నిజం చెప్తున్నా. నేను పూరు మహారాజు గారి దర్శనానికి వచ్చా. నేను ఆయన్ను కలుసుకోవడం చాలా అర్జెంట్ "

" ఏవన్నావు? "

" అదేనండి. నాకు చాలా అవసరం. "

సేనాపతి సైనికులతో" వీడు శత్రుపక్షం చారుడే! వీడిని తీసుకెళ్లి చెరసాలలో ఉంచండి. యుద్ధం తర్వాత వీడిసంగతి చూద్దాం" అన్నాడు.

సైనికులు నన్ను రెక్కలు విరిచి కట్టి ఈడ్చుకు పోతుంటే నేను ," పూరు మహారాజా!నన్ను రక్షించు నన్ను రక్షించు" అని గావుకేకలు పెట్టా. పూరుమహారాజు శిబిరం సమీపంలోనే ఉన్నట్టుంది. నా ఆర్తనాదాలు ఆయన చెవిన పడ్డాయి. ఆయన వెంటనే నన్ను తన సమక్షంలో హాజరు పరచవలసిందని భటుల ద్వారా వర్తమానం పంపాడు.

సైనికులు నన్ను పూరు మహారాజు శిబిరంలోకి తీసుకెళ్లి ఆయన ముందు నిలబెట్టారు. ఆయన్ని చూశా. మనిషి దేవేంద్రుడిలా వెలిగిపోతున్నాడు. ఆరున్నర అడుగుల ఎత్తైన విగ్రహం. బంగారు చాయ. కళ్లూ ముక్కూ కుశలుడైన శిల్పి చెక్కినట్టున్నాయి. మొహంలోంచి రాజతేజస్సు ఉట్టిపడుతోంది.

ఆయన కుండలాల కున్న వజ్రాలు , కెంపులు - వర్షాకాలపు మెరుపుల్లా మెరుస్తున్నాయి. కవచం, మొలకి కత్తి ధరించిన ఆ దివ్య సుందర

మూర్తిని అలా తిలకిస్తూ ఉండిపోయా.

" ఇతడిని బంధవిముక్తుడిని చేయండి' అని ఆజ్ఞాపించగానే సైనికులు నా కట్లు విప్పారు. పూరు మహారాజు నావైపు సౌమ్యంగా చూసి " అతిథి వర్యా! ఇది యుద్ధభూమి. మా సైనికులు అందరినీ అనుమానంగానే చూస్తారు. అందువలన నీకు కలిగిన అసౌకర్యానికి విచారిస్తున్నాను. నువ్వు మరోలా అనుకోకు! " అన్నాడు.

" ఎంతమాట మహారాజా! నాకు మీ దర్శన భాగ్యం కలిగింది. దాని ముందు ఈ అసౌకర్యం ఏపాటిది?ఇంకా పెద్ద అసౌకర్యం కూడా భరించగలను. దేశాభిమానం , పరాక్రమం మూర్తీభవించిన మిమ్మల్ని దర్శించి నా జీవితం ధన్యం అయింది ప్రభూ! " అని సాష్టాంగ నమస్కారం చేశా.

పూరు మహారాజు మందహాసం చేసి, "నువ్వెవరవు?" అని అడిగారు.

"ముందు నేను ఒక మనవి చేయదలుచుకున్నాను మహారాజా! స్వార్థపరుడైన తక్షశిల ప్రభువు అంభి అలక్షేంద్రుడికి స్వాగతం పలికి దేశద్రోహం చేశాడు. ఆ దేశ ద్రోహి పన్నాగం పారితే మన భారత మాత విదేశీ ఆక్రమణదారులకి కైవసం అవుతుంది. అందుకే అలక్షేంద్రుడితో యుద్ధంచేసి అతడు భారత దేశంలో ప్రవేశించకుండా అడ్డగించడానికి పూనుకున్న మీకు నా శుభాకాంక్షలు. మీకు విజయం చేకూరాలని నా అభిలాష, నా ఉద్దేశం" అన్నా.

" ధన్యవాదాలు! కానీ నువ్వెవరు?"

" నేను భారత వాసినే కాని ఈ యుగానికి చెందిన వాడిని కాదు మహారాజా! 23 శతాబ్దాల తరువాత వాడిని! "

పూరు మహారాజు బిగ్గరగా నవ్వి - " అలాగా! మరి నువ్వు ఈ యుగంలోకి ఎలా వచ్చావు? " అని ప్రశ్నించాడు.

" అదెలాగో నాకు కూడా తెలియదు. మహారాజా ! కాని ఈ యుద్ధాలలో మిమ్మల్ని విజయశ్రీ వరించేందుకు కొన్ని సూచనలు చేయడానికి వచ్చా! ' '

" నీ మాటలు విచిత్రంగా ఉన్నాయి. సరే! నీ సూచనలు ఏమిటి?"

" అలక్షేంద్రునికి అపార సేనాబలం ఉంది కానీ దూరప్రయాణం చేసి పరదేశంతో యుద్ధం చేస్తున్నందుకు అన్నిటికంటె పెద్దలోటు స్థానబలిమి కొరవడటం"

" బాగా చెప్పావు. నువ్వు వివేకవంతుడిలాగే ఉన్నావు. ఐతే ఓ విషయం చెప్పు? అలక్షేంద్రుడి అశ్వబలం యుద్ధవిద్యలో ఆరితేరినదని , అది అతడి విజయానికి ఆయువుపట్టు అని విన్నా . అది నిజమేనంటావా?"

" ఔను. అది నిజమే మహారాజా! కానీ మీరు దిగులు చెందనవసరం లేదు. అతడి లశ్వబలాన్ని చిత్తు చేయడానికి మీ వద్ద గజబలం ఉంది. అతడికి గజబలం లేనే లేదు. ఐతే మీరు మీ గజబలాన్ని మాత్రం అతి నేర్పుగా ఉపయోగించాలి. లేకపోతే శత్రుధనుర్ధారుల బాణాలకు గురై అవి వెనుతిరిగి మీ పదాతిబలాన్ని తొక్కివేయవచ్చు. "

" ఔను. నీ సూచన చాలా బాగుంది."

" వర్షాకాలం కదామహారాజా? నేల జారుగా ఉంటుంది. అందువలన కూడా మీ బలగం ముఖ్యంగా ధనుర్ధారులు విల్లులని నేలకు ఆన్చి బాణాలు విడుస్తారు కదా! దానివలన నేల జారుగా ఉంటే విల్లు జారి బాణాలు గురి తప్పవచ్చు.'

" ఔను. అది నిజమే! నేను వెంటనే మా సైన్యాధికారులను సమావేశపరిచి ఈ విషయాలు చర్చిస్తాను. నువ్వు చక్కని సలహాలు ఇచ్చినందుకు ధన్యవాదాలు! అన్నట్టు నువ్వు మా అతిథివి. ఇది యుద్ధభూమి అయినా మా పురాతన సంప్రదాయం ప్రకారం నీకు తగిన అతిథి మర్యాదలు జరిపిస్తాం. " అని చెప్పి నన్ను సమస్త రాజకీయ అతిథి మర్యాదలతో బాటు ప్రత్యేక శిబిరంలో బస ఏర్పాటు చేయించండి" అని ఆదేశించాడు.

" మళ్లీ కలుసుకుందాం, అతిథివర్యా! " అని నాకు వీడ్కోలు చెప్పగానే , నేను ఆయనకు పాదాభివందనం చేసి బైటికి నడిచాను.

నా పట్ల సైనికుల వైఖరి ఒక్కసారిగా మారిపోయింది. నన్ను రెక్కలు విరిచి కట్టి పూరు మహారాజు ముందు నిలబెట్టిన సైనికులే వినయవిధేయతలతో వంగి, నన్ను ఇటు దయచేయండి స్వామీ " అని వేడుకుంటున్నారు.

నాకు ప్రత్యేక శిబిరంలో బస ఏర్పాటు చేశారు. పట్టు పరుపులు , పట్టు దిండ్లు, పట్టు ఒత్తులు గల ఆసనాలు, రంగురంగుల తెరలుగల ఆ శిబిరాన్ని రత్నాలు , మణులు పొదిగిన రజత, స్వర్ణ , చందనాది అలంకారాలతో అతి మనోహరంగా సుసజ్జితం చేశారు. చప్పట్లు కొట్టగానే తలలు వంచి చేతుల కట్టుకుని భటులు హాజరు.

అలగ్జాండరు సైన్యం జీలమ్ నది ఆవలి ఒడ్డున , పూరు సైన్యం ఈవలి ఒడ్డున విడిది చేసిఉన్నాయి. అలెగ్జాండర్ నది దాటడానికి అదను చూస్తున్నాడు.

సాయంకాలం అయింది. నేను నది ఒడ్డున అలా వాహ్యాళికి చేసి వద్దామని శిబిరం బయటికి వచ్చా! నది ఒడ్డున చేరి నడక సాగించా. పూరు మహారాజు సైనిక శిబిరాల్లో హడావుడి, కోలాహలం దూరం కాసాగాయి. నది ఒడ్డున వాతావరణం ప్రశాంతంగా ఉంది. సూర్యాస్తమయం అయింది.ఐనా కూడా నేను నడుస్తూనే ఉన్నా. చీకట్లు కమ్ముకున్నాయి.

భారత దేశ చరిత్రలో ఈ యుద్ధంతాలూకు ప్రాముఖ్యం గురించి ఆలోచిస్తూ పరధ్యానంగా నడుస్తూనే ఉన్నా. ఇంతలో జీలమ్ నది మలుపు వచ్చేసింది. అయ్యో! నేను పదిహేను పదహారు మైళ్లు నడిచానన్న మాట! చాలా ఆలస్యం అయింది. తిరుగు ముఖం పట్టాలనుకుంటూండగా ఏవో రహస్య ధ్వనులు! ఏమిటా అని చుట్టూ చూశా.

నదిలోంచి కాగడాల ప్రకాశం కనిపించింది. పెద్ద పెట్టున రహస్య కార్యకలాపాలు సాగుతున్నట్టనిపించింది. నన్న గొంతుకలో సైనికాదేశాలు, గుర్రాలు నది దాటుతున్న సవ్వడి చెవిన బడింది.

" అమ్మ బాబోయ్ ! అలగ్జాండర్ సైన్యంతో సహా ఈ చోట రహస్యంగా నది దాటుతున్నాడు.

## పీనాసితనం

స్కాట్లండ్ వాళ్లు పీనాసితనానికీ, అతితెలివికీ పెట్టింది పేరు. ఓ సారా కొట్టువాడు మరొక కొట్టువాడితో చెప్పాడు -

"మనిషి తాగి ఉన్నప్పుడు నేను అరువుమీద విస్కీ అమ్మను. అంతగా అమ్మాల్సి వచ్చిందనుకో, రెట్టింపు రేటుకమ్ముతాను."

"నాకలాంటి సందర్భం వచ్చినప్పుడు సగం రేటుకే అమ్ముతాను!" అన్నాడు రెండోవాడు.

"అదేం?"

"సింపుల్! చాలా సందర్భాల్లో అలాంటివాళ్లు డబ్బు ఎగ్గొడతారు. తక్కువ రేటుకమ్మితే మన నష్టం కూడా తగ్గుతుందిగా!"

సేకరణ: **ఎమ్బీయస్ ప్రసాద్**

పూరు మహారాజు మాత్రం శత్రువు తన మకాముకి ఎదురుగా నది దాటుతాడని అక్కడే నిరీక్షిస్తున్నాడు. ఈ విషయం నేను తక్షణం పూరు మహారాజు కు అందజేయాలని నిశ్చయించుకున్నాను. వెంటనే వెనుతిరిగి పరుగందుకున్నా.

కానీ ఎంత పరుగెత్తినా పూరు మహారాజు సైన్యం కనబడదే! అలా పరిగెత్తుతూనే ఉన్నా ! తూర్పున సూర్యకిరణాలు ప్రస్ఫుటించాయి. నేను నాస్పీడ్‌ని పెంచా. ఇంతలో వర్షం మొదలైంది. మధ్యాహ్నం అయింది. కానీ పూరు మహారాజు సైన్యం జాడలేదు. అప్పుడు నాకు బాగా అర్థం అయింది. నేను తప్పు దిశలో పరుగెత్తుతున్నానని.

" అయ్యో! ఈ పాటికి అలగ్జాండర్ నది దాటి పూరుమహారాజు సైన్యం మీద మెరుపు దాడి చేసి ఉంటాడు,. నేను ఎంత కోరుకున్నా పూరుమహారాజుని కాపాడలేకపోయాను కదా! అనివాపోతూ మరో దిశలో నడిచా. వర్షం పడుతోంది.

ఇంతలో పర్వతాకారంగా ఉన్న ఏనుగు నావెనకగా వస్తూ కనబడింది. దాని ఒంటినిండా గాయాలు. దాని అంబారిలో అతి విశాల మైన ,అందమైన మానవవిగ్రహం కూర్చుని ఉంది. ఏనుగు మెడపై మావటి కూర్చుని ఉన్నాడు.

ఆ గజరాజు దగ్గరకు రాగానే అంబారి లో ఉన్న మనిషి పూరు మహారాజే నని పోల్చుకున్నా. . ఆయన ముఖారవిందం విషాదంగా ఉంది. ఆయన ఒంటిపైన గాయాలున్నాయి.

' పూరు మహారాజా !ఆగండి. " అని నేను అరిచా.

పూరు మమారాజు నన్ను చూసి " అతిథి వర్యా నువ్వా ? నేను యుద్ధంలో ఓడిపోయానోయ్ ! అలక్షేంద్రుని సైనికులు నన్ను లొంగిపోవడానికై ఒప్పించాలిని వెంటాడుతున్నారు. " అన్నాడు ఏనుగు మీం చి.

" నన్ను కూడా మీతోనే ప్రయాణం చేయనీయండి మహారాజా! " అని వేడుకున్నా. ఆయన మావటికి సంజ్ఞ చేయగా ,మావటి ఏనుగుని ఆపి నన్ను ఎక్కించుకున్నాడు. నేను పూరు మహారాజు ఎదురుగా కూర్చున్నా. ఏనుగు ప్రయాణం సాగించింది.

పూరు మహారాజు నావైపు విచారంగా చూసి ఇలలా అన్నాడు. " నువ్వు చెప్పింది నిజమేనోయ్ కానీ నేను ఏనుగుల మొహరింపులో పొరబాటు చేశా. వాటిని సైన్యానికి ముందు రక్షణగా నిలబెట్టా. ఐతే శత్రు సైనికులు వాటిని తమ మూకలోకి రానిచ్చి ఈటెలతో , బాణాలతో పొడిచారు. అవి వెనక్కు తిరిగి మా సైనికులనే మట్టి వేయసాగాయి. అందు మూలంగా మా సైన్యం చెదిరిపోయి, శత్రు సైనికుల బాణాలకు చాలా వరకూ హతమైనాయి.

" చాలా విషాదకరమైన విషయం మహారాజా!నేను నిన్నరాత్రి జీలమ్ నది దాటుతూండగా గమనించి మీ కు తెలియజేద్దామని పరుగుతీశారు. నేను తప్పు దారిపట్టాను. దాంతో మీకా భోగట్టా తెలియజేయలేకపోయాను. "

" ఔను. అలక్షేంద్రుడి సైన్యం అక్కడ నది దాటిన విషయం మీకు ఆలస్యంగా తెలిసింది. ఇది మా గూఢచారి వ్యవస్థలో లోపం వల్ల జరిగింది. అక్కడ శత్రువుల్ని ఎదుర్కోవడానికి మా చిరంజీవిని పంపించా. కానీ వాడు వీరగతి పొందాడు. తరువాత నేను కూడ ఆపెద్ద సైన్యంతో కలియబడ్డా కానీ లాభం లేకపోయింది. నాకు కూడా తొమ్మిది గాయాలు తగిలాయి. చూడు. " అని తన శరీరంపై తగిలిన గాయాలు చూపించాడు పూరు మహారాజు.

"అది సరే కానీ మీ ధనుర్ధారులు చాలా సమర్థులు కదా! "

" ఔను . కానీ వాళ్లు తమ పొడవైన విల్లులని నేలపై నిలబెట్టి బాణాలు విడుస్తారు కదా! వర్షం వలన నేల జారుగాఉండటంవల్ల వాళ్ల సామర్థ్యం దెబ్బతిన్నది.

" మరి నేను దాని గురించి మిమ్మల్ని హెచ్చరించాను కదా! "

" అన్నట్టు నువ్వు హెచ్చరించావు కాదా! కానీ నేను ఆవిషయమే మర్చిపోయా. నా సైన్యాధికారులతో ఆ మాటే చర్చించలేదు. "

"జరిగింది ఏదో జరిగింది. మీరు లొంగిపోవడమే మేలనిపిస్తోంది. "

" లొంగిపోతే అలక్షేంద్రుడు నాతో ఎలా వ్యవహరిస్తాడో అని నా అనుమానం."

" మీకా బెంగవద్దు మహారాజా! అతడు సాటిలేని యోద్ధయే కాదు. మహనీయుడు కూడా. అరిస్టాటిల్ లాంటి మహా జ్ఞాని శిష్యుడు కూడానూ. ఆయన మిమ్మల్ని తమ సమవుజ్జీగా గౌరవిస్తాడు. ఆయన ఎన్నటికీ మిమ్మల్ని పరాభవించడు. "

" నీకు బాగా నమ్మకం ఉందా! "

" ఉంది మహారాజా! ఒక వేళ మీతో ఎలా వ్యవహరించాలి అని అతడు మిమ్మల్ని అడిగితే , ఒక సమ్రాట్టు మరొక సమ్రాట్టుతో ఎలా వ్యవహరించాలో అలా' అని బదులివ్వండి. అతడు మీ రాజ్యం మీకు అప్పగించవచ్చు కూడా! "

" ఔను. నువ్వు మంచి సలహానే ఇచ్చావు. అతడి మనుషులు బాగా సమీపానికి వచ్చారు చూడు. " అన్నాడు పూరు మహారాజు వెనక సమీపిస్తున్న గుర్రపు రౌతుల్నిచూపించి.

పూరు మహారాజు వెంటనే మావటిని ఏనుగుని ఆపమని పురమాయించాడు. ఏనుగు ఆగి మోకాళ్లపై కూచోగానే ఆయన దిగిపోయాడు.

" మహారాజా ఆగండి. నేను కూడా మీతో వస్తాను. నన్నుకూడా దిగనీయండి " అని అరుస్తూ కంగారుగా మడిచి పెట్టిన ఏనుగు కాలుపై అడుగు పెట్టి దిగబోయా. కానీ తత్తరపాటులో కాలు జారింది.

చూద్దును కదా! నా పడకపై పడుకుని ఉన్నా. నేను చదువుతున్న పుస్తకం " అలగ్జాండర్స్ కాంపేన్ ఇన్ ఇండియా" (భారతదేశంలో అలగ్జాండర్ దండయాత్రలు ) జారి కిందపడివుంది.

